# కొత్త పాఠం

విహారి



**మధ్యాహ్నం మూడు గంటల యింది.**

**నారాయణ ఒక నిశ్చయానికి వచ్చాడు. కలం కాగితం తీసు కొన్నాడు.**

★★★

"నాన్నా,

నేనిట్లా అంటున్నానని ఏమీ అనకోకు. నేను నిన్ను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నానో, లేక నువ్వు నన్ను ఇంకా పసిపిల్లవాడిగానే భావిస్తున్నావో తెలియడం లేదు.

ఎన్నో సందర్భాలలో నా మనసు వికలమవుతూ వుంటుంది. గులకరాయి పెట్టి చెరువులో కప్పలాటగా నీటిమీదన కొట్టినట్లువుతుంది. ఎప్పుడో చాలా సేప టికి ఆ తాకిడి ప్రభావం అడుగుతుంది. అదోక భయా నకమైన అలజడి.

నాకిప్పుడు ఇరవై ఆరేళ్లు. అతి కష్టం మీద పేపరు వైజ్‌గా అయిదేళ్లు చదివి అయిందనిపించాను బియ్యేని. ప్రస్తుతం లోకంలో జీవికకు పనికిరాని డిగ్రీ అది. మరి మొన్నటికి మొన్న నువ్వూ, అమ్మా,నేనూ, తమ్ముడు రవి, చెల్లి స్వరూప కలిసి మీ దూరపు బంధువు కూతురు పెళ్లికెళితే కళ్యాణమంటపంలో పది పదిహేను మందికి నన్నేమో ఎంబిఏగా పరిచయం చేశావు. ఏ క్షణాన్న విరుగుతుందో తెలియని ములగ కొమ్మ మీద నిలబెట్టావు. నేనేమో ఆముదం తాగిన మొహం పెట్టుకొని కుర్చీలో కూర్చుండిపోతిని.

తమ్ముడేం చేస్తున్నాడు చెప్పు? చదవబ్బలేదు. 'నాకు చదువొచ్చే లక్షణాలు లేవు, నన్ను చంపకండి' అని ఖరాఖండీగా చెప్పి ఇంటర్‌తో గంటవాయించి, సెట్విన్‌లో కండక్టర్‌గా కదురుకున్నాడు కదా. వాణ్ణేమో ఎంసెట్‌కి తయారువుతున్నాడంటివి. స్వరూప ఫస్ట్ ఇంటర్ కదా చదివేది. అలాగే చెప్పావు. హమ్మయ్య అని నేను ఊపిరి పీల్చు కోనే లోగా దాన్నో రేంక్ స్టూడెంట్‌ని చేసి, టెన్త్‌లో దానికి ఐదొందల అరవై మార్కులు వేసేస్తివి. పాపం దానికళ్ళముందు, మూడొందల నలభై అంకె కనపడి చెమటలు పట్టించిందాయె! కళగల దాని పసిడి మొహం చెమట ముత్యాలతో మెరిసిపోయింది.

ఇక, మా అమ్మను గురించి నీ జోకులేమో దీనికి విరుద్ధంగా సాగిన్నై. మమ్మల్ని ఎవరెస్ట్ ఎక్కించి, అమ్మను పాతాళానికి పంపించావ్. నువ్వు అభి- ఐష్ పెళ్ళి గురించి మాట్లాడుతుంటే 'ఆ పిల్లకి 'మంచని' పేరేమిటండీ' అని అడిగిందా? నువ్వామెని తిరపతి తీసుకెళ్తే, 'అసలీ దేవుడెవరండీ' అని అడిగిందా?

ఎందుకు నాన్నా, ఇందంతా? నలభై ఎళ్ల తర్వాత నీ వాళ్ళముందు నువ్వు గొప్పవాడివని చెప్పుకోవటానికా?

ఆ మధ్య మీ ఆఫీసరెవరో ఫోన్ చేస్తే నా గురించి చెప్తూ, నేనేదో మార్కెటింగ్ కంపెనీలో ఎగ్జాక్యూటివ్‌నని చెప్పటం నాకు స్పష్టంగా వినపడింది. నా ఉనికిని ఉచ్ఛ స్థితికి ఎగరేస్తున్నావో, నీచస్థితిలో పాతేస్తున్నావో తెలయని అయోమయమ యింది - నా మనసు. మరి నేను చేసేది - వాడి కాళ్ళో, వీడి గడ్డమో పట్టుకుని క్రెడిట్ కార్డులు అంటకట్టటమాయె!

ఆ రోజు ఇంకో మాట కూడా అన్నావ ఆయనతో. నిన్ను కార్లో డ్రాప్ చెయ్యావలసిన తమ్ముడు చాలా బిజీగా ఉండి వెళ్ళిపోయాడని!

ఎందుకు నాన్నా మా మీద ఇన్నిన్ని తూటాలు పేలుస్తావు?

అమ్మ చెప్పింది. ఆ మధ్య ఆమే నువ్వూ ఎవరిదో దశదిన కర్మకి చంద్రమ్మత్త వాళ్ల వూరికి పోతే, ఆమె పాపం తన కొడుక్కి ఏదైనా ఉద్యోగం చూసి పెట్టమన్నదిట. అతనేమో ఇంటర్ ఫెయిల్డ్. వాడికి సరాసరి ఇంద్రపదవి కట్టబెట్టే శక్తికలవడిలాగా, గవర్నమెంటంతా నీచేతిలో వున్నట్టే అరచేతిలో స్వర్గం చూపావుట. అవును. నీది గవర్నమెంట్ జాబే. కానీ ఏమిటిది? సాదాసీదా గుమాస్తాగిరీ కదా! ఉద్యోగాలిప్పించే శక్తి నీకుంటే, నన్నెందుకిట్టా అఘోరించమన్నావు చెప్పు. నీ చెల్లెలె దగ్గర కూడా ఎందుకు నాన్నా ఈ రంగుల చిత్రాలు?

అనేక సందర్భాలు గమనించాను. ఎదుటివారు నువ్వు చాలా గొప్పవాడివని అనుకోవాలనే కోరికనీది. అందుకనే, తరచు పార్టీలూ, ఫంక్షన్లూ అంటూ భేషజానికిపోతావు. అమ్మ ఒకసారి కంటతడిపెట్టింది. 'అప్పుడప్పుడూ చుక్కేసుకుంటా'వని చెప్పి.



6

ఒకసారి శంకరమఠంకి వెళ్ళాం మనం. ఎవరో చాలా పెద్ద పడితుడు భారతోపన్యాసాలు చేస్తున్నాడు. అది అప్పుడే అయిపోయింది. అక్కడ ఎవరో పరిచితులు పలకరించారు. నిలబడ్డాం. వాళ్ళు ప్రసంగవశాన శంకరభాష్యం గురించి ఏదో మాట్లాడుకుంటున్నారు. నువ్వు వెంటనే వాళ్ళల్లో దూరేశావు. అన్ని వేదాంతాల గురించీ చెప్పటం ప్రారంభించి సూఫీ తత్వంలోకి వెళ్ళిపోయావ్. శంకరభాష్యంలాంటిది నువ్వు చూశావా నాన్నా అసలు? 'గుర్రంకొండ అనగానే, నాకు తెలుసు, దాన్ని ఆ ఆకారంలో కట్టటానికి చాలా తిప్పలు పడ్డారుట' అన్నాడట ఎవడో! అలా లేదూ, నీ వ్యవహారం?

సూపర్ మార్కెట్ సంఘటన నిన్ననేగా జరిగింది. అక్కడ మేనజర్‌తో చాలా తరచుగా నువ్వు విమానాల్లో ముంబై ఢిల్లీలు తిరుగుతూ వున్నట్టు చెప్పావు. నాకు తెలసి, విమానం లోపలెలా వుంటుందో, నీకూ తెలీదు, నాకూ తెలీదు!

స్వరూప క్లాస్‌మేట్ రాణీ వాళ్ళ నాన్నకి మన యిల్లొక సినిమా సెట్‌లా చూపించావుట. ఆ అరచేతిలో స్వర్గం గురించి కూతుర్నడిగితే, ఆ పిల్ల స్వరూపని అడిగిందిట, 'స్వరూపా, మీకు వేరే బంగళా ఏదైనా వుందా' అని!

అసలు మనింట్లో దండిగా వున్నదేమిటి? ఇరుకూ, మురికీ, గలీజూ, గబ్బూ కదూ?!

నువ్వు తరచుగా అంటున్నట్లు ఏ పుణ్యఫలమో, కరివేపాకంత సాహిత్య గంధం అబ్బింది నాకు రవ్వంత లోకజ్ఞానం కలిగింది. అందుకని అడుగుతున్నాను.

నాన్నా నీలో నువ్వు నీ వ్యక్తిత్వ విధ్వంసాన్నీ, ఆరోగ్య భంగాన్నీ పెంచుకుపోతున్నావ్. మంచిది కాదు నాన్నా. జీవితం సంక్లిష్టంగా తయారయింది. నిజమే. పైపై మెరుగులకే పట్టం కట్టే వ్యక్తి దౌర్బల్యం, విష సంస్కృతీ సమాజంలో పెరిగిపోతూ వుండవచ్చు. కానీ, నువ్వు మాకు పంచుతున్న ఈ బాధని మూగగా అనుభవించటం స్థల కాలాల స్పృహని కోల్పోయేటట్లు చేస్తోందనిపిస్తోంది, నాకు.

ఈ మధ్య మన దేశ పౌరుల తత్వాన్ని గురించీ, ప్రవర్తనలోని వైరుధ్యాల్ని గురించీ ఏదో సర్వే చేశారట. 'విష్ లెవెల్' లో బతికేవాళ్ళు తొంభై శాతమని వచ్చిందిట ఫలితం. అంటే, అంతరాంతరాల్లో వాళ్ళ 'వాంఛ' ఏదో అది నెరవేరినట్లు, తామొక విజయాన్ని సాధించినట్లు ఒక భ్రాంతికి లోనవుతూ, ఒక మిథ్యా గౌరవాన్ని ఆపాదించుకుటూ తమని తాము ఆకాశానికెత్తేసుకుంటూ వుంటారన్నమాట!

ఒక్క మాట నాన్నా!

మీ ప్రవర్తన వలన ఫలితం తెలుసా? మీ పరోక్షంగా దారుణమైన వ్యాఖ్యలూ, వార్తలూ, అవహేళనలూ, జోక్స్ వెలువడుతూ వుండటం. వాటిని ఎక్కుపెట్టేది మామీద! అమాయకంగా మేమూ జోకర్లమైపోతున్నాం.

ఎందుకని అంటే....

వాస్తవం దాగదు కనుక. అరచేతిలో నిప్పు కణికని పట్టుకొని ఎంతసేపని ఎన్నాళ్లని తిరగగలం?!

★★★

ఏకబిగిన ఉత్తరం రాయడంద పూర్తి చేసి, ఊపిరి పీల్చుకున్నాడు నారాయణ. మనస్సు ప్రశాంతమయింది. గుండెల్లో బరువు తొలగినట్లయింది.

టైము చూశాడు. ఐదయింది.

పక్కగదిలో తల్లి నరసమ్మ మిషన్ కుడుతోంది. చెల్లెలు స్వరూప పుస్తకాలు చేత్తో పట్టుకొని ఇంట్లోకి వస్తోంది. కాలేజీ అయిపోయినట్లుంది.

నారాయణ లేచి తల్లి దగ్గరగా వెళ్లాడు. ' ఆకలవుతోందమ్మా. ఇవాళ ఇల్లు కదల్లేదుగా. బయట తిరుగుతుంటే ఏవో చాయ్ నీళ్లు ఆరగారగా పడుతూ వుండేవి' అన్నాడు.

నరసమ్మ సన్నగా నవ్వింది. మిషన్ ఆపి, దాన మీది గుడ్డలు సర్ది లేచింది. 'నాలుగు బజ్జీలు వేస్తా వుండు. అదీ వచ్చిందిగా' అన్నది చెల్లెల్ని ఉద్దేశించి. వంటింట్లోకి నడిచింది.

నారాయణ, స్వరూప హాల్లో కూర్చున్నారు. కాలేజీ కబుర్లేవో చెప్తోంది స్వరూప.

సరిగ్గా అప్పుడొచ్చాడు చంద్రమ్మ, వాళ్లాయన కుళ్లప్ప, కొడుకు సురేంద్ర. వాళ్లది కడప దగ్గర పల్లె.

నరసమ్మ బయటకొచ్చి ఆహ్వానించింది. 'రండి...రండి... వదినా' అంటూ. కాళ్లు కడుక్కొని కూర్చున్నారు ముగ్గురూ. కాఫీ చేస్తూనే పరామర్శలోకి దిగింది నరసమ్మ. పిల్లలూ ఒకళ్లతో ఒకళ్లు మాట కలిపేరు.

కాఫీలు అయినాయి. నారాయణకి కాఫీనే దక్కింది. బజ్జీలు వాయిదా పడినట్లు అర్థమైంది.

ఉన్నట్టుండి గొంతెత్తాడు కుళ్లాయప్ప. "మీ వదిన చెప్తావుంది అని అరవై లే అప్పు జేస్తిస్తి. మీ ఇస్టం యాడన్నా సావండంటినా? నా గ్గూడా సరిగ్గా తెలీదు. అ లెక్కంతా మీ యాయన కిచ్చారమ్మా.





శ్రీరస్తు... శుభమస్తు

కాకతీయతో కళ్యాణమస్తు!

ఆకుపచ్చని తోరణం... పసుపు పచ్చని గడప... 'కాకతీయ' తెచ్చిన పెళ్ళి మండపం... 3 దశాబ్దాలుగా... 4 రాష్ట్రాల్లో.... 30 నగరాలలో.... చక్కని పెళ్లికి.... చిరకాల అనుబంధానికి... కాకతీయ మ్యారేజెస్ ప్రైవేట్ లిమిటెడ్. నేడే మీ సమీప బ్రాంచ్‌ను సందర్శించండి. మీ కలల భాగస్వామిని కలుసుకోండి.



శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచిలి

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్

103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.

ఫోన్ : 040-2374 7777, 09396 999 999

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

మా బ్రాంచ్‌లు

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | తాంబరం | 093400 99993 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | బెంగుళూరు | 093429 39345 |
| విజయవాడ | 093922 92939 | జయానగర్ | 093429 39343 |
| గుంటూరు | 098485 35375 | మైసూరు | 093429 39342 |
| తెనాలి | 098480 31931 | కోయంబత్తూరు | 093457 94668 |
| విశాఖపట్నం | 098481 63833 | సేలం | 093855 99066 |
| రాజమండ్రి | 098485 35377 | మధురై | 093603 35233 |
| కాకినాడ | 098483 37378 | వెల్లూర్ | 093449 94400 |
| ఖమ్మం | 093470 59988 | తిరుచి | 098428 01111 |
| ఒంగోలు | 098487 11223 | పాండిచ్చేరి | 098421 27777 |
| నెల్లూరు | 098481 97222 | ఈరోడ్ | 093855 99011 |
| తిరుపతి | 098485 35378 | అనంతపూర్ | 093460 09348 |
| కర్నూల్ | 093900 33815 | | |




7



మనవరాలి పెళ్లి కళ్లారా చూడాలని తపించిపోయింది.
తీరా టైముకి కళ్లజోడెక్కడో పారేసుకుంది!

ఆయనేమో గమ్మునయిపాయె. సర్లో దెగ్గిర మానం పోతా వుండాది. ఉద్జోగం లేదు. లెక్కా లేదు. ఇప్పటికి ఐదారు దఫాలు ఫోను కొట్టినాము. యింటాండాడు ఆ యప్ప. బాగా ఇబ్బందిగా వుండాది. ఇప్పుడయితే ఏమీ లేదు. ఏమీ లేవు అనే... ఈయన రికార్డేస్తా వుండాడు''

ఆయన మాటలకి కొనసాగింపుగా చంద్రమ్మ ఎత్తుంది. ''అవునొదినా, మనం బాకీలుండామంటే సిన్నతనం గాదూ. ఎట్లోగట్ల సేద్దాం ఆగండి అంటాండాడు అన్న. మాటలు పెట్టుకుంటే, నాకైతే అనుమానమే. మా లెక్కకి కాళ్లొచ్చే'' అని కన్నీళ్లు పెట్టుకొని ఆ విషయం తేల్చుకుపోవాలని వచ్చినట్లు విడమరిచింది. సురేంద్ర మూతి బిగించుకు కూర్చున్నాడు.

నరసమ్మకి, పిల్లలకీ విషయం అర్థమైపోయింది.

శంకరయ్య నిర్వాకం బయటపడింది.సురేంద్రకి ఉద్యోగం ఇప్పిస్తానని అరవై వేలు తీసుకున్నాడన్న మాట. నరసమ్మకి గుండెలదిరితే, నారాయణకి గుండెలు దిగినై. ఇద్దరూ ఎవరి మనసుల్లో వాళ్లు 'ఈయన గుండెలు తీసిన బంటయిపోయాడు' అనుకున్నారు.

ఆ రాత్రి....

ఆ ఇంట్లో అరుపులూ మాటల కొట్లాటలూ. శంకరయ్య ఒక్కటే మాట మీదున్నాడు. 'సాయం చేద్దామనుకుంటే ఇట్లాయే. మధ్యవర్తి ముంచాడు' అని.

కుళ్లాయప్పకి కడుపు రగిలిపోయింది.సురేంద్ర కళ్లల్లో తంగేడు పూలు. చంద్రమ్మ ఏడుపులూ, 'ముందు గాల నా మెడ మీద గొట్టాల' అనీ 'బాగా బుద్దొచ్చాది' అని సన్నాయి నొక్కులూ.

'పని సానుకూలమైతే నేనే కబురు చేస్తా. అప్పటిదాకా ఆగాల్సిందే. నేనేమన్నా తిన్నానా? మీ డబ్బులు వాడికిస్తిని. చూద్దాం' అని హాయిగా నిద్రపోయాడు శంకరయ్య.

కొలిమిలో కూచున్నట్లు తెల్లావార్లూ అట్టాగే నిలువు గుడ్లేసుకూచుని, తెలతెలవారుతుండగా బస్సుకు తిరిగి వెళ్లిపోయారు చంద్రమ్మ, కుళ్లాయప్పా, సురేంద్ర. నరసమ్మిచ్చిన పసుపూ, కుంకుమ గూడా రుసరుసలాడ్తూనే తీసుకొంది చంద్రమ్మ.

టైమ్ గడుస్తోంది. పొద్దుకరుకుదేరుతోంది. ఇంట్లో వారంతా యాంత్రికంగా ఎవరి పనుల్లో వారు నిమగ్నమైపోయారు. ఎవరి అంతరంగ ఘోష వారిదిగా వుంది.

ఇల్లు గాయాల నేల మాదిరిగా వుంది.

ఎనిమిదవుతోంది. సురేంద్ర ఒంటరిగా వచ్చాడు. తల్లీదండ్రీ వెళ్లిపోయారు. ఇంటిల్లపాదీ ఆశ్చర్యపోయారు. హాల్లో కూర్చున్నాడు. శంకరయ్య అడిగాడు. ''ఏమిరా, ఏమయింది?'' అని. 'మాట్టాడాల పని వుండాది. ఆ మీద పోత' అని ఊరుకున్నాడు.

స్నానాలు, టిఫిన్లు అయినై. పక్షులు గూట్లో నుంచీ బయటపడుతున్నై. శంకరయ్యని అనుమానంగా చూస్తూ నారాయణతో కలిసి బయటకి వెళ్లాడు సురేంద్ర.

లకడీకాపుల్ దగ్గర వారి దారులు వేరయినాయి.

★★★

లంచ్ టైమ్ దాటింది.

అప్పుడొచ్చాడు శంకరయ్య ఆఫీస్‌కి సురేంద్ర. తమ డబ్బు తీసుకున్న మధ్యవర్తిని చూపమని కూచున్నాడు. ఆయనతో తనే నేరుగా మాట్లాడాలన్నాడు.

మేనల్లుడి మీద శంకరయ్యకి చిర్రెత్తుకొచ్చింది. మామయ్యన్న గౌరవం లేకుండా ఏమిటీ మాటలని గద్దించాడు. మాటా మాటా పెరిగింది. ఇద్దరూ రెచ్చిపోయారు. మాటల మధ్యలో బయటపడిపోయాడు శంకరయ్య. నిజాన్ని కక్కేశాడు. 'అసలు మధ్యవర్తులెవరూ లేరు. నేనే ప్రయత్నిస్తాను. డబ్బు ఖర్చయిపోయిందని!

సురేంద్ర తనతో పిలుచుకొచ్చి సిద్ధంగా వున్న ఓ టీవి బృందాన్ని రంగప్రవేశం చేయించాడు. శంకరయ్య తల తిరిగిపోయింది. 'వీడికిన్ని తెలివితేటలా' అని ఆశ్చర్యపోయాడు.

'ఉద్యోగాలిప్పిస్తామని అమాయకుల డబ్బుని దోచుకు తింటున్న ప్రభుత్వోద్యోగులు' అని స్టోరీ తయారైపోయింది!

దృశ్యం అంతా నానా గలీజుగా మారింది. శంకరయ్యకి ప్రశ్నల బాణాలు! కథ ఎక్కడెక్కడికో పరుగులు తీసింది. ఆఫీస్ వాళ్లకి ఉచిత వినోద ప్రదర్శన లభించింది.

చివరకి సురేంద్ర ఇది మా కుటుంబవ్యవహారమే. దీని వెనుక ముఠాలు, గిఠా ఏమీలేవని తన మాటగా చెప్తే జనమూ, టీవి జనమూ పలచబడ్డారు.

'రేపటికంతా మా లెక్క మాకివ్వకపోతే, నిన్ను జైల్లో పెట్టిస్తా'అని శంకరయ్యను హెచ్చరించి ఆ సమయానికి అక్కడికి చేరుకున్న స్నేహితుడితో మోటార్ బైక్ మీద వెళ్లిపోయాడు సురేంద్ర. శంకరయ్యకి పెద్ద షాక్ తగిలింది. సురేంద్ర ఇంతవాడయ్యాడనరి తెలుసుకోలేకపోయినందుకు తన బుద్ధితక్కువతనాన్ని, తనే తిట్టుకున్నాడు.

–రాత్రయ్యేసరికీ ఈ వార్త ఊరూ వాడతో పాటు శంకరయ్య ఇంట్లో అందరికీ కూడా తెలిసిపోయింది.

★★★

అర్ధరాత్రి దాటుతుండగా తాగి, తూలుతూ ఇల్లు చేరాడు శంకరయ్య. వెళ్లి గదిలో పక్కమీద వాలిపోయాడు. తనలో తాను ఏవో పిచ్చి మాటలు మాట్లాడుకోసాగడు.

మూగతనాన్న కప్పుకొని కూర్చున్నారు ఇంట్లో వారంతా. కుదురు తవ్వేసిని మొక్కల్లా తలో మూల పడివున్నారు.

భర్త అంత డబ్బు తగలేసినందుకు రగిలిపోతోంది నరసమ్మ. ఇలాంటి ఆలోచనలతోనే నారాయణ మనసూ వికలమయివుంది. 'అంత మొత్తం ఖర్చయ్యేంత స్థాయిలోతన అతిశయాన్ని, భేషజాన్ని చూపాడన్నమాట'అనిపించింది. తండ్రి ఎంత వేగంగా, ఏ వైపు పరుగులు తీశాడో, ఎతెంతగా మిథ్యాడంబరాన్ని ఎక్కడెక్కడ ప్రదర్శించాడో అర్థం కాలేదు.' నిజంగానే సురేంద్రకి సహాయపడాలని ఇతరుల్ని తాగించీ, తినిపించీ తాను బొందనపడ్డాడా అని సందేహం వచ్చింది.

'రేపటి సంగతి ఏమిటి?' అనే ప్రశ్న నారాయణ మెదడుని తొలుస్తోంది.చుట్టూ చూశాడు. నేల మీద కొంగుపరుచుకుని పడి వుంది అమ్మ. తమ్ముడూ, చెల్లెలూ కన్నీళ్లతో దిగులుగా, దిగాలుగా గోడకి చేరబడి కూర్చున్నారు. కాలం చాప కింద నీరు. అది జరిగిపోతూనే వుంది!

★★★

తెల్లవారడమే దుర్దినంగా తెల్లవారింది.

ఆ ఇంట్లో పెడబొబ్బలు, ఏడుపులు శోకఘోష. రాత్రి అట్లా మంచం మీద పడిపోయిన శంకరయ్య మళ్లీ లేవలేదు. నిద్రలోనే ప్రాణం పోయింది. ఆత్మహత్యా, సహజ మరణమా? అనే తర్జన భర్జన మొదలైంది. తలో మాట అంటున్నారు.

'మీ వాళ్లందరికి ఫోన్లు కొట్టు నారాయణా' అన్నాడు ఎవరో పెద్దాయన. అపార్ట్‌మెంట్స్ వాళ్లంతా అప్పటికప్పుడో అక్కడ చేరారు.

అడ్రస్‌ల పుస్తకం కోసం జేబులో చెయ్యి పెడితే, ఉత్తరం వేళ్లకి తగిలింది నారాయణకి. అవును, అది తెగించి తను ఇన్నాళ్లకి నాన్నకి రాసిన ఉత్తరం. తన గుండె లోఅరల్లో నిండిన ఘోష! రాసే ఉపయోగం లేకుండా పోయిన ఉత్తరం! బట్వాడా కాని ఉత్తరం!

నారాయణ కళ్లు చెమర్చాయి. దుఃఖం తన్నుకొచ్చింది. ఒక జీవిత కాలం లేటయిన రైలు అతని కళ్ల ముందు కదిలింది!

నిర్వేదంగా తండ్రి శవం కేసి చూశాడు.

కొందరి జీవితాల ముగింపు వారి జీవనశైలికి భిన్నంగా వుండదు కాబోలు! వారు చేసుకున్న పాపానికో, నేరానికో ఫలితంలా భయం గొల్పుతూ వుంటుంది'అనిపించింది. బహుశా ఎదుటివారికి పాఠం నేర్పుతుంది కూడానేమో అని అనిపించింది. కళ్లు తుడుచుకుంటూ పక్కకి కదిలేడునారాయణ!!

★



8